క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ అందజేత



ధన్వాడ: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు రాకసుల గుట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రూ.20 వేల విలువ చేసే ప్రింటర్, పేపర్ బండిల్స్‌ను అందజేశారు. పాఠశాల సౌకర్యార్థం ప్రింటర్ అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గాయత్రి, హెచ్ఎం నరసింహాచారి, శంకరయ్య, తపస్ అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నర్సిరెడ్డి పేరు ప్రకటించడంపై హర్షం

ధన్వాడ: నారాయణపేట మెడికల్ కళాశాలకు దివంగత ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి పేరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై ధన్వాడకు చెందిన అఖిల పక్ష నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాములుశెట్టి, శ్రీనివాస్‌రెడ్డి, చిట్టెం శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ధన్వాడకు చెందిన నర్సిరెడ్డి ఇక్కడి ప్రాంతం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయనను ఈ విధంగా స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ముశ్రీఫా గ్రామానికి చెందిన బిచ్చాల మోహన్ శుక్రవారం అర్ధరాత్రి ముశ్రీఫా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని కోస్గి దారిలో వస్తుండగా.. పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిచ్చాల మోహన్ ఇసుక తరలించేందుకు అవసరమైన అనుమతి పత్రాలు చూపకపోవడంతో కేసు నమోదు చేశామని ఏఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

24 నుంచి ఉచిత ఆర్మీ కోచింగ్

దామరగిద్ద: జిల్లా కేంద్రంలోని చౌక్‌బజార్ సమీపంలో మిల్కాసింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్మీ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు కోచింగ్ డైరెక్టర్ బాపన్‌పల్లి గ్రామానికి చెందిన మహేష్ తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి, బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ చేయూతతో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు 99661 16128 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కేవీఆర్ కాలనీ ప్రారంభం



మరికల్: మండలంలోని తీలేర్ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే దివంగత కె.వీరారెడ్డి పేరు మీద అదే గ్రామంలో ఓ కాలనీకి కేవీఆర్ కాలనీ పేరు పెట్టగా.. ఆయన కుమారుడు డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల ప్రజా జీవితంలో గడిపిన వీరారెడ్డి పేరును తమ గ్రామంలో ఓ కాలనీకి పెట్టడం తమ కుటుంబ సభ్యులకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవతమ్మ పాల్గొన్నారు.

దామరగిద్ద వాసి ప్రతిభ



దామరగిద్ద: బెంగుళూర్‌లో జరిగిన ఆల్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ మీట్‌లో 2025 పాల్గొన్న దామరగిద్దకు చెందిన క్రీడాకారుడు రవికుమార్ మూడో స్థానంలో నిలిచాడు. 400 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలవగా మరో పోటీలో రెండు స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన క్రీడాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి పి.యాదగిరి తెలిపారు. శనివారం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రైతులతో కలిసి ఆయన విడుదల చేశారు.

విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపర్చాలి

మక్తల్: ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి, వారికి చదువులో రాణించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ఎంఈఓ అనిల్‌గౌడ్ సూచించారు. శనివారం పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అపార్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్తులు, విద్యావంతులు, దాతల సహకారం తీసుకొని పాఠశాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థులు ఇబ్బందులు పడే పాఠ్యాంశాలను మరోమారు నివృతి చేయాలన్నారు. సమావేశంలో హెచ్ఎంలు చంద్రకళ, వెంకటయ్యగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఎంఈఓ అనిల్‌గౌడ్

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై అవగాహన

దామరగిద్ద: విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేలా తరగతి గదిలో బోధన కొనసాగాలని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయి ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వంటి చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా 40 రోజుల పాటు ఆర్పీలు శిక్షణ అందజేశారు. ఉపాధ్యాయురాలు లక్ష్మి మాదిరి పాఠ్యంశ బోధన చేపట్టారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు అశోక్‌కుమార్, అన్నపూర్ణ, సత్యనారాయణ, ఆర్పీలు చంద్రకాంత్, బాలాజీ, బాలమురళి, ఆలోకిత్ కోఆర్డినేటర్ ఎలిజిబెత్, సీఆర్పీ మహిపాల్, రాములు పాల్గొన్నారు.



దామరగిద్దలో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

‘ఆలోచిద్దాం.. ఆచరిద్దాం’

కోస్గి రూరల్: పర్యావరణంలో చోటుచేసుకుంటున్న సమస్యలు గుర్తించి అప్రమత్తంగా ఉందామని, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వీర్లాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణ సంక్షోభం నివారణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యంగ్ ఎర్త్ లీడర్ సమన్వయకర్త వార్ల మల్లేషం మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి బాటలో నడిచేందుకు యువ నాయకత్వం అవసరమన్నారు. విశ్వంలో జీవి మనుగడకు కేవలం భూమి మాత్రమే అనుకూలమని, అభివృద్ధి పేరిట కొనసాగుతున్న చర్యలు పర్యావరణానికి తీవ్ర విఘాతం కల్గిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సమతుల్యత లోపించి జీవవైవిధ్యానికి నష్టం జరిగితే ఆహార గొలుసులో మార్పులు ఏర్పడి జీవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఆలోచిద్దాం.. ఆచరిద్దాం అనే నినాదంతో విద్యార్థులతో చర్చ వేదిక నిర్వహించారు. కార్యాక్రమంలో ప్రదానోపాధ్యాయుడు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు సిద్ధిరాములు, త్రిగుణకరశాస్త్రి, భీమయ్య, అహ్మద్‌పాషా, మల్లయ్య, రాజమణి తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

చట్టాలపై అవగాహన తప్పనిసరి

మక్తల్: మాగనూర్ మండలంలోని నేరడగం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలను నిర్మూలించేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు, యువత చొరవ చూపాలన్నారు. బాల రక్షణ కోసం 1098 కు ఫోన్ చేసి సహాయం పొందొచ్చని సూచించారు. ఆడపిల్లలను మధ్యలోనే చదువు మాన్పించడం ఇంకా కొన్ని గ్రామాల్లో కొనసాగుతుందని, దాని నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎల్లగౌడ్, లీగల్ అడ్వైజర్ అధికారి కవిత, సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవిత

‘ముఖ్యమంత్రి పర్యటన నిరాశపరిచింది’

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు నిరాశే మిగిల్చారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం, బీసీ పక్కా భవనాల నిర్మాణాల వంటి వాటి గురించి సీఎం ఊసెత్తలేదన్నారు. అదే విధంగా జిల్లా ఏర్పడి ఆరేళ్లు పూర్తయినా ఉన్నత చదువుల కోసం విద్యార్థుల వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఈ అంశాలను మరోమారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి, జిల్లాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, ఇంతియాజ్, చరణ్‌రెడ్డి, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేష్

మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మరికల్: మండల కేంద్రంలోని హరిజన్‌వాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం నుంచి మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభించారు. మొదటి రోజు పూజారులు విగ్రహాలకు జలాధివాసం చేసి పూజలు చేశారు. ఆదివారం సామూహిక హోమాలు, 24న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన పూజలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

కోనేరు శుభ్రం చేసిన స్వయం సేవకులు

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామ శివారులో గల లోకాయపల్లి సంస్థానం పరిధిలోని గుట్టపై వెలసిన శ్రీ ఔదుంబర్ క్షేత్రంలోని కోనేరును స్వయం సేవకులు శనివారం శుభ్రం చేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మల్లికార్జున స్వామిని కొలవడం ఆనవాయతీ. ఈ క్రమంలో భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో భక్తిశ్రద్ధలతో స్నానమాచరించి దర్శనానికి వెళ్తారు. అయితే కోనేరు పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఉండడంతో పలువురు ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు కోనేరులో దిగి శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పూర్తిగా తొలగించి పురాతన కోనేరుకు కొత్త శోభను తీసుకొచ్చారు.



కోనేరుని శుభ్రం చేస్తున్న స్వయం సేవకులు

యుద్ధభేరి వాల్‌పోస్టర్ విడుదల



నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా జరిగిన వివిధ కాంప్లెక్స్ సమావేశాల్లో శనివారం మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు యుద్ధభేరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరెడ్డి మాట్లాడుతూ.. టీఎస్ సీపీఎస్ఈ ఆధ్వర్యంలో మార్చి 2న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఓపీఎస్ సాధననే ఏకైక మార్గంగా ముందుకు వెళ్దామని ఉద్యోగ సంఘాలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి తమ సమస్యలు వివరించి, సీపీఎస్ వల్ల జరుగుతున్న నష్టాలను వివరిద్దామన్నారు. పాత పెన్షన్ విధానం వల్ల ఎంతో ఉపయోగకరం ఉంటుందని తెలియచేద్దామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో కోశాధికారి రాజేందర్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, తిరుపతినాయక్, తిరుపతిరెడ్డి, వెంకట్రాములు, విజయారెడ్డి, రాము, రఘువీర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. శనివారం కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ ఇంటి కోసం ఎంపికైన లబ్ధిదారులకు నిర్మాణంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. గ్రామంలో మొత్తం ఎల్‌వన్ కింద 20 ఇళ్లు మంజూరు కాగా.. వాటిలో 16 మందిని అర్హులుగా గుర్తించారు. ఇళ్లు మంజూరయిన లబ్ధిదారులు సర్వేలో చూయించిన ఇంటి స్థలంలో మాత్రమే నిర్మించుకోవాలన్నారు. నిర్మాణ క్రమంలో నాలుగు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట టౌన్: సనాతన ధర్మాన్ని ఆచరించి, పరిరక్షించాల్సిన అవసరం ప్రతి హిందువుపై ఉందని మాణిక్యగిరి స్వామి పండిట్ శ్రీరాములు అన్నారు. పట్టణంలోని పరిమళాపురం ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శనివారం రాత్రి హిందూ సంఘాల ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిచారు. ఈ సందర్భంగా వారు అక్కడి భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ డా.మదన్‌మోహన్‌రెడ్డి, వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు కేతన్ రఘు, శ్రీధర్, శ్రీపాద కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

‘మత్తు రహిత సమాజమే లక్ష్యం’

నారాయణపేట ఎడ్యుకేషన్: మహిళా శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్తా భారత్ అభియాన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదో తరగతి, జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచనలో భాగంగా మత్తు పదార్థాల వ్యసనం – వాటి దుష్ఫలితాలు, చిత్ర లేఖనంలో భాగంగా మత్తు పదార్థాల వల్ల కలిగే పరిణామాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జాబితాలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచడానికి ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్ కుమారి సంధ్య, ఎఫ్ఆర్ఓ సాయి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణసింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు సూచనలు

నారాయణపేట రూరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం టీ షాట్ వేదికగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యక్షంగా చూపించారు. జిల్లాలో జరుగుతున్న ప్రీ ఫైనల్ పేపర్ను రద్దు చేసి కార్యక్రమంలో హాజరయ్యేందుకు ప్రోత్సహించారు. ముఖ్యంగా విషయ నిపుణులు సబ్జెక్టుల వారీగా మార్కుల సాధన, ప్రశ్నాపత్రం విధానం, పరీక్ష రాసే పద్ధతి తదితర అంశాలపై సలహాలు అందించారు. ప్రత్యేక ఫోన్ నంబర్ను ఏర్పాటు చేసి లైవ్‌లోనే విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు నిపుణులు గణపతి శర్మ, హరికృష్ణ, వనజ, మధుసూదన్, ఎల్లయ్య సమాధానాలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ప్రొజెక్టర్ల ద్వారా విద్యార్థులను భాగస్వాములను చేయగా ఆయా ప్రక్రియను విద్యాశాఖ అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. శనివారం రద్దు చేసిన ఇంగ్లిష్ పరీక్షను మార్చి 1న మధ్యాహ్నం నిర్వహించాలని డీఈఓ ఉపాధ్యాయులకు సూచించారు.



టీ షాట్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీఎస్ఓ భానుప్రకాష్

‘పరమాత్మను ఆత్మశుద్ధితో కొలవాలి’



మరికల్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పరమాత్మను ఆత్మశుద్ధితో కొలవాలని బ్రహ్మకుమారి ఈశ్వర విశ్వవిద్యాలయ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మహాదేవి విద్యార్థులకు సూచించారు. శనివారం మరికల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ త్రిమూర్తి శివరాత్రి విశిష్టతను వివరించారు. అలాగే శివుడికి అభిషేకాలు, ఉపవాసం చేయడం వల్ల కలిగే భగవంతుడి ఆశీర్వాదం గురించి తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ శివరాత్రిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. సునీత, అనసూయ, వీరమణి, సుధారాణి పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

నర్వ: మండలంలోని బుద్దిగానితండా, జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ రామకృష్ణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌లైన్, బేస్ లైన్, మిడ్ లైన్ రిపోర్టుల గురించి ఆరా తీశారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులో విద్యార్థులను మౌఖికంగా ప్రశ్నలు అడిగి రాత అంశాలను విద్యార్థుల చేత బ్లాక్ బోర్డుపై రాయించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. అపార్ ఐడీ వేగవంతం, పాఠశాలలో పరిశుభ్రత పలు అంశాలపై తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

వ్యక్తుల అదృశ్యం

మద్దూరు: మండలంలోని రెనివట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రెనివట్లకు చెందిన సిరిగని రాములు (50) కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో పిచ్చిగా ప్రవర్తిస్తూ ఈ నెల 20న తెల్లవారుజామున ఇంటి నుంచి గట్టిగా అరుస్తూ బయటకు పరుగెత్తుకుంటూ వెళ్లినట్లు భార్య నర్సమ్మ తెలిపారు. బంధువుల ఇళ్లు, తెలిసిన వారి దగ్గర వాకబు చేసినా ఆచూకీ లభింకచపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత..

పిల్లిగుండుతండాకు చెందిన చిట్టిబాయి (28) భర్త రవినాయక్‌తో గొడవ పడి ఇంటి నుంచి ఈ నెల 20న వెళ్లిపోయింది. తల్లిగారి ఇల్లు, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి విస్లావత్ లక్ష్మణ్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆచూకీ తెలిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో గానీ, 87126 70407 నెంబర్‌కు సంప్రదించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ కోరారు.

పాథర్చేడ్‌లో..

నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామానికి చెందిన కుర్వ నర్సిములు తండ్రి నరసప్ప ఈ నెల 6న ఇంట్లో గొడవ పడి అలిగి ఇంటి నుంచి వెళ్లాడు. ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కురుమయ్య తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు అతడు మెరున్ కలర్ ప్యాంట్, లేత ఆరెంజ్ కలర్ చొక్కా, పింక్ కలర్ టవల్ వేసుకున్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు నర్వ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ 87126 70410, 99494 88647 నంబర్లను సంప్రదించాలని కోరారు.



కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన కోట్ల హజ్జుమియా అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హజ్జుమియా నాలుగేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. హజ్జుమియా కుమారుడు షేక్ మహబూబ్ పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి

దామరగిద్ద: భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యయాదవ్‌ను శనివారం మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నసాగర్ గ్రామంలో పోతురాజు ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రాజ్, భీమప్ప, అంజయ్య, సురెందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి



కృష్ణా: మండలంలోని కున్సీ ఉన్నత పాఠశాలలో శనివారం బేటీ పడావో– బేటీ బచావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్టులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రతి బాలికకు చదువు అందించాల్సిన అవసరంతో పాటు బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ నర్సింహారాజ్, అనిత, హెచ్ఎం సంతోషి, స్పెషల్ ఆఫీసర్ అరుణ, పంచాయతీ కార్యదర్శి స్వామినాథ్, ఉపాధ్యాయులు నరేందర్, నర్సిములు, శివరాజ్, సుశ్మిత తదితరులు ఉన్నారు.

దొంగకు రిమాండ్

దామరగిద్ద: మండలంలోని ఉల్లిగండం గ్రామంలో చోరీకి పాల్పడిన దొంగను శనివారం పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ రాజు వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. ఉల్లిగండం గ్రామానికి చెందిన చంద్రమోళ్ల వెంకటప్ప కుటుంబ సభ్యులు ఈ నెల 12న ఇంటికి తాళం వేసి మన్యంకొండ జాతరకు వెళ్లారు. 13వ తేదీన ఇంటికి తిరిగి రాగా.. ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. అయితే చోరీకి పాల్పడిన వ్యక్తి పరారీ సమయంలో గ్రామంలోనే ద్విచక్ర వాహనం వదిలి పెట్టి వెళ్లాడు. దీన్ని ఆధారంగా కర్ణాటక రాష్ట్రం సేడం తాలూకా చల్లరకొత్రిక గ్రామానికి చెందిన భైరంకొండ శీను అలియాస్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి 5.9 తులాల బంగారం ఆభరణాలు, రూ. 60వేల నగదు రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీఐ శివకుమార్ సమక్షంలో నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును చేధించిన ఎస్ఐ రాజు, క్రైం టీం రాము, ఆంజనేయులు తింగమూర్తిలను సీఐ అభినందించారు.